# కామాక్షి కథ

వేసుకుని కామాక్షి కెలాగైనా సాయం చేయాలని తీర్మానించుకున్నారు.

మర్నాడే కామాక్షి మొగుడూరికెళ్ళాడు. నాలుగురోజుల తర్వాత కామాక్షికి టెలిగ్రాం వచ్చింది. దాని మొగుడు వార్నీషు తాగి, ఆస్పత్రిలో పడున్నాడని తక్షణం కామాక్షిని బయిలుదేరి రమ్మని.

టెలిగ్రాం చూసిన కామాక్షి కంట తడిపెడ్తూ తను వెళ్ళడానికి చేతులో డబ్బులేదనీ, కట్టుకున్న మొగుడావిధంగా ఆస్పత్రిలో పడుంటే తను వెళ్ళకపోతే లోకం ఆడిపోసుకుంటుందనీ, లోకం కోస మైనా తను వెళ్ళక తప్పదనీ... మా అత్త గారి కాళ్ళమీద పడింది. మళ్ళీ రెండు రోజుల్లో తిరిగొచ్చే కండిషన్ మీద దాని జీతంలో అడ్వాన్సు యిచ్చారు మా అత్త గారు. మా అత్తగా రిచ్చిన అడ్వాన్సుతో బాటు కట్టుకోడానికి చీరలు లేవని నా దగ్గర ఒకచీర తీసుకుంది.

కామాక్షి ప్రయాణం అవుతుందనగానే రెడ్డి, నాగప్ప, వంటవాడూ, కామాక్షి చుట్టూ చేరారు. మొగుడు దగ్గరకు వెళ్ళ వద్దని, దూరంనుంచే చూసేసి రమ్మన మని మరీ మరీ చెప్పారు. ఆ రోజే తీసు కున్న జీతాల్లోంచి వాళ్ళిచ్చిన వందరూపా యలూ తీసుకుని, వేలూర్లో ఉన్న మొగుణ్ణి చూసొస్తానని వెళ్ళింది కామాక్షి.

'వారం రోజులైంది...పదిరోజు లైంది ... పదిహేను రోజులైంది. కామాక్షి జాడే లేదు. రెడ్డికీ, నాగప్పకీ వంటవాడికీ రోజు రోజుకీ గాభరా ఎక్కువైపోయింది. 'కామాక్షి ఏమైపోయిందో అని' వాళ్ళు ముగ్గురూ లోలోపల దిగులుపడి పోయారు. కామాక్షి కోసం ఎదురు చూసి, చూసీ మాయింట్లో అందరి కళ్ళూ కాయలు కాచాయి.

ఒకరోజు మా పాలవాణ్ణి అడిగింది మా అత్తగారు 'కామాక్షి ఊర్నుంచి ఎప్పుడొస్తుంది ?' అని. కామాక్షి మా పాలవాడింటి పక్కనే ఉండేది. పాలవాడు చెప్పాడు కామాక్షి ఊర్నించి రావడమేమిటి? ఊర్లోనే ఉందని, దానిమొగుడూ ఊర్లోనే ఉన్నాడని, కామాక్షి వేరే ఎక్కడో పని చేస్తోందనీ, చెప్తూ, ఇలా నాటకం ఆడ్డం వాళ్ళిద్దరికీ అలవాటేనని చెప్పాడు. వాళ్ళి ద్దరూ అసలు భార్యాభర్తలు కారనీ, ఇలా చాలచోట్ల మోసంచేసి, కామాక్షి చాల డబ్బు సంపాయించిందనీ కూడ చెప్పాడు.

ఆ మాట విన్న మా అత్తగారు 'హారా! హారా! ఎంత జాణ! ఎంత జాణ!' అంటూ ఇచ్చిన అడ్వాన్సు డబ్బు తల్చుకుని గుండెలు బాదుకున్నారు.

ఈ మాట విన్న రెడ్డి, నాగప్ప, వంట వాడూ ఒకరి తలలు ఒకరు పట్టుకుని కుప్ప కూలిపోయారు...కాస్త కూస్త డబ్బు కాదు వాళ్ళు కామాక్షి కిచ్చింది కొన్ని వందలు...దొంగకు తేలుకుట్టినట్లు బాధ పడుతున్న ఆ ముగ్గురికీ మూలిగే నక్క మీద తాటికాయ పడ్డట్టు మా అత్త గారు ఒక కఠినశిక్ష విధించారు. కామాక్షికి చూపించిన సానుభూతికి బదులుగా వెంటనే వేరే మంచి పనిమనిషి దొరికేదాకా కామాక్షి చేసిన పనంతా వాళ్ళనే చేయ మన్నారు.

కొత్త పనిమనిషి ఎప్పుడొస్తుందా అని వేయికళ్ళతో ఎదురు చూడటం మొద లెట్టారు. రెడ్డి, నాగప్ప వంటవాడూ... వెనకా ముందూ జంఝాటం లేని తల నెరిసిన పనిమనిషి కోసం మా అత్తగారు ఎదురుచూస్తూ కూచున్నారు. ●

